నామమాత్రపు ప్రయోగాలే..!

విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన ఎంత అవసరమో ప్రాక్టికల్స్ కూడా అంతే అవసరం. సొంతంగా తెలుసుకున్న విషయాలను జీవితాంతం గుర్తుంచుకుంటారు. ఉన్నత చదువులు చదివినప్పుడు అవి ఎంతగానో ఉపయోగపడతాయి. దీన్ని గుర్తించిన పెద్దలు ఇంటర్ విద్యార్థులకు విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ప్రయోగాలు చేయించడం మొదలుపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థుల ప్రయోగాలకు సంబంధించి నిధులు ఇవ్వడం లేదు. చాలా కాలేజీల్లోని ల్యాబ్‌లలో రసాయనాలు, స్పెసిమన్లు అలమారాలకే పరిమితమయ్యాయి. ఇతర పరికరాలు బూజు పడుతున్నాయి. సోమవారం నుంచి ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అరకొర వసతులు, పరికరాలతో ప్రాక్టికల్స్ ఎలా చేయించాలని అధ్యాపకులు వాపోతున్నారు.


వరదయ్యపాళెం జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్ పరీక్షల్లో విద్యార్థులు (ఫైల్)

- పరికరాలు, రసాయనాలకు నిధులివ్వని ప్రభుత్వం
- ల్యాబ్‌లున్న చోట బూజు పట్టిన పరికరాలు
- కొన్ని కాలేజీల్లో కాగితాల్లోనే ప్రయోగశాలలు
- థియరీ, పోటీ పరీక్షలకే పరిమితమైన ప్రైవేటు కాలేజీలు
- నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్


జువాలజీ విభాగంలో ప్రాక్టికల్‌కు హాజరైన విద్యార్థులు (ఫైల్)

మండలం	విద్యార్థుల సంఖ్య
వరదయ్యపాళెం	113 మంది
నాగలాపురం	32 మంది
సత్యవేడు	120 మంది
పిచ్చాటూరు	140 మంది

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలోని జూనియర్ కళాశాలల్లో ఇంటర్‌మీడియట్ సైన్స్, మ్యాథ్స్ చదివే విద్యార్థులకు సోమవారం నుంచి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. వరదయ్యపాళెంలో 113 మంది, నాగలాపురంలో 32 మంది, సత్యవేడులో 120 మంది, పిచ్చాటూరులో 140 మంది విద్యార్థులు ఈ ఏడాది ప్రాక్టికల్స్‌కు హాజరుకానున్నారు. చాలా కాలేజీల్లోని లాబుల్లో తగినంత మేర పరికరాలు, రసాయనాలు లేవు. దీంతో పిల్లలకు ప్రయోగాలు చేయించలేదు. ప్రైవేటు కాలేజీల్లో పేపర్లలోనే ప్రయోగాలు చేయిస్తున్నారు. థియరీ, పోటీల పరీక్షలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ క్రమంలో పిల్లలు ప్రాక్టికల్స్‌లో ఎలా ప్రయోగాలు చేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో ప్రయోగాల నిర్వహణ కోసం ఏడాదికి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు నిధులు విడుదల చేసేది. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు మారాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థి చెల్లిస్తున్న రూ.2 వేల ఫీజుతో పాటు రూ.400 ప్రయోగాల కోసం కేటాయిస్తున్నారు. వసూలు చేసిన మొత్తం ల్యాబ్‌ల్లో పరికరాలు, రసాయనాల కొనుగోలుకు సరిపోకపోవడంతో ఆయా కళాశాలల్లో అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా ప్రయోగాలు చేయించి సరిపెట్టేస్తున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫస్ట్ ఇయర్ నుంచే ప్రయోగాలు చేయించాలి. కానీ ప్రైవేటు కాలేజీల్లో ఎక్కడ కూడా చేయించడం లేదు. ఈ విషయాన్ని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు తనిఖీల్లో గుర్తించినా.. వారికి ఆయా కాలేజీలపై చర్యలు తీసుకునేందుకు ఎలాంటి అధికారం లేకుండా బోర్డు ఉన్నతాధికారులు చేశారనే విమర్శలు ఉన్నాయి. ఈ కాలేజీల్లో ప్రయోగ పీరియడ్లు లేకుండా థియరీ, జేఈఈ, నీట్ వంటి పోటీల పరీక్షల తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రయోగ పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో హడావిడిగా విద్యార్థులను ల్యాబ్‌లకు తీసుకుని వెళ్తున్నారని విమర్శలున్నాయి.

ప్రైవేట్ యాజమాన్యాలు ఇష్టారాజ్యం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యను అకడమిక్ క్యాలెండర్ ప్రకారం నిర్వహించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అకడమిక్ క్యాలెండర్‌ను పట్టించుకోవడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రయోగ పరీక్షలను జంబ్లింగ్ విధానంలో నిర్వహించి ఎలాంటి అవకతవకలకు అస్కారం లేకుండా చేసింది. ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు కాసులతో ప్రస్తుత ప్రభుత్వం నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహించేలా చేసినట్లు విమర్శలున్నాయి. ప్రస్తుతం ప్రయోగ పరీక్షలను ఏ కాలేజీకి చెందిన విద్యార్థులు ఆ కాలేజీలోనే రాయనున్నారు.

ప్రయాణికురాలి బ్యాగు చోరీ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం రాత్రి 8:20 గంటల ప్రాంతంలో శ్రీకాళహస్తి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికురాలి బ్యాగును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. అతన్ని పట్టుకునేందుకు ప్రయాణికులు, స్థానికులు ప్రయత్నించినా ఫలితం లేదు. అతను రైల్వే స్టేషన్ వైపు పరుగులు తీశాడు. రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంగణంలో పోలీసుల నిఘా ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆవును కాపాడిన స్థానికులు


రైల్వే పోల్ సందులో ఇరుక్కున్న ఆవు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రైల్వే పోల్ సందులో తల ఇరుక్కుని బయటకు రాలేక అవస్థ పడుతున్న ఆవును స్థానికులు ఆదివారం రాత్రి కాపాడారు. రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలోని వారపు సంత వద్ద పెద్ద వాహనాల నియంత్రణ కోసం పోల్ ఏర్పాటుచేశారు. వారపు సంత జరిగినందున మిగిలిపడేసిన కూరగాయల కోసం ఆవు అటుగా వెళ్లింది. పోల్ మధ్యలోవున్న కూరగాయలను తినడానికి తలపెట్టింది. దీంతో తల ఇరుక్కుపోయింది. గమనించిన స్థానికులు రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని పోల్ ప్లేట్‌ను వెల్డింగ్ మెషిన్‌తో కట్ చేసి ఆవును కాపాడారు.

క్లుప్తంగా

నేటి నుంచి వ్యాసాశ్రమంలో గురుపూజోత్సవాలు

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు వ్యాసాశ్రమంలో సోమవారం నుంచి మూడు రోజులు 88వ గురు పూజోత్సవాలను ఆశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వ్యాసాశ్రమంలోని అధిష్టాన మందిరంలో జరగనున్న ఉత్సవాల్లో సోమవారం పాదుకుల పూజ, మంగళవారం స్త్రీల పూజ, బుధవారం పురుషుల పూజలు చేస్తారు. ఉత్సవాలకు ఏర్పాట్లను ఘనంగా చేసినట్టు ఆశ్రమ మేనేజర్ మన్నెం అమరనాథరెడ్డి వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రానున్నారని, వారికి వసతి సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు.

శరవేగంగా గంగమ్మ ఆలయ నిర్మాణం


గంగమ్మ గుడి నిర్మాణం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచన పుత్తూరు గ్రామంలో గంగమ్మ ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా చేస్తున్నారు. ఆలయం నిర్మించాలని ఎన్నో సంవత్సరాలుగా కోరిక ఉన్నప్పటికీ చేపట్టలేకపోయామని, మూడు నెలలుగా పనులు జరుగుతున్నాయని నిర్వాహకుడు, మాజీ సర్పంచ్ గురవయ్య తెలిపారు. త్వరలోనే గంగమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించి, కుంభాభిషేకం చేస్తామన్నారు.

ముక్కంటిని దర్శించుకున్న రాజస్థాన్ ఎమ్మెల్యే


ఆలయం వద్ద మహంత్ బాలక్‌నాథ్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం రాజస్థాన్ ఎమ్మెల్యే, బీజేపీ ఉపాధ్యక్షుడు మహంత్ బాలక్‌నాథ్ దర్శించుకున్నారు. ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చాముండేశ్వరి దేవికి కొలుపు పూజ


కాళమనాయుడుపేటలో పూజలందుకుంటున్న చాముండేశ్వరిదేవి అమ్మవారు

సత్యవేడు: మండలంలోని కాళమనాయుడుపేటలో శనివారం రాత్రి దేవాంగులు చాముండేశ్వరి దేవికి పూజలు చేశారు. రాత్రి గ్రామంలో నలుమూలల అష్టదిగ్బంధనం చేశారు. చెరువు వద్ద అమ్మవారికి చెమ్మి చెట్టు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని తీసుకువచ్చి గణపతి ఆలయంలో కొలువు ఉంచారు. అమ్మవారి విగ్రహాన్ని మహిషాసుర మర్దినిగా రూపుదిద్దారు. ప్రత్యేక పూల అలంకరణ చేశారు. మహిషాసుర మర్దినికి ఇష్ట పద్యాలు పాడారు. మహానైవేద్యం సమర్పించారు. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు పట్టారు.

13న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో 13న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవాలకు ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా 13వ తేదీ ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు.

నేడు ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలంలో సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు వైద్యాధికారి డాక్టర్ ఛత్రప్రకాష్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. ఈ మాత్ర వేయడం వల్ల పిల్లల కడుపులో ఉన్న కొంకి పురుగులు, నులి పురుగులు, బద్దె పురుగులు నశిస్తాయని వెల్లడించారు. తద్వారా పిల్లల్లో ఎదుగుదల బాగుంటుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు వేయాలని సూచించారు.

మాంసం, చేపలు బహిరంగ ప్రదేశాల్లో అమ్మితే చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగలోని రోడ్డుకు ఇరువైపులా బహిరంగ ప్రదేశాల్లో మాంసం, చేపలు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. ఆయన ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగలో చేపలు, మాంసం విక్రయాలను అడ్డుకున్నారు. ఆయన మాట్లాడుతూ చేపలు, మాంసం బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడపడితే అక్కడ అమ్మడం వలన కొంతమంది ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వీటిని అమ్మడం కోసం విక్రయదారులు మాంసం మార్కెట్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు.


కేటీ రోడ్డు పక్కనే అమ్ముతున్న చేపలను తొలగిస్తున్న, ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్

చెరుకు రైతులకు బకాయిలు చెల్లించండి


రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్ధన్

వరదయ్యపాళెం: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చెరుకు రైతులకు బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్ధన్ ఆదివారం ఒక పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు. నింద్ర మండలంలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆరు సంవత్సరాలుగా రూ.35 కోట్లను రైతులకు చెల్లించకుండా మోసం చేసిందని ఆరోపించారు. అలాగే బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని మయూర షుగర్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం మరో రూ.20 కోట్లు రైతులకు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతోందని పేర్కొన్నారు. బకాయిలపై కూటమి ప్రభుత్వం గత 7 నెలలుగా ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణమని వెల్లడించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న చెరుకు బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు దాని గురించి ఇప్పటి వరకు పట్టించుకోవడం లేదని విమర్శించారు. తక్షణమే పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

ఉత్సాహంగా సీనియర్ క్రికెట్ పోటీలు

చిల్లకూరు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన సీనియర్లు 7 జట్లుగా ఏర్పడి ప్రతి ఏడాది ఫిబ్రవరి నెలలో రెండు రోజులపాటు క్రికెట పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో పోటీ పడ్డ సిలికా లెవన్స్‌పై గ్రావెల్ లెవన్స్ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా చింతవరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సీనియర్ క్రికెటర్లు పదహారేళ్లుగా నిర్విరామంగా పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. అనంతరం విజయం సాధించిన గ్రావెల్ లెవన్స్ జట్టుకు కప్పును అందించారు. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు మదు, రఘుబాబు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భరత నాట్యం

తిరుపతి రూరల్: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం రాత్రి వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చెన్నైకి చెందిన బాబాంజలి నృత్యాలయ కళాకారులు ప్రదర్శించిన భరత నాట్యం అందరినీ అలరించింది. నృత్యాలయం ప్రతినిధులు, నృత్యకారులు, కళాకారులను శిల్పారామం పరిపాలన అధికారి ఖాదర్‌వలి సత్కరించారు.



శిల్పారామంలో నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

గడ్డివామి దగ్ధం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం గుండేలిగుంట మిట్ట ఇండ్ల వద్ద శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ కార్యకర్త అర్జున్‌రెడ్డి గడ్డివామిని దుండగులు దగ్ధం చేశారు. అతను పదేళ్లుగా ఆ ప్రాంతంలో గడ్డివామి వేసుకుని పశువులను మేపుకుంటున్నాడు. శనివారం రాత్రి కొందరు దుండగులు ఆ స్థలాన్ని ఆక్రమించుకోవాలనే ఉద్దేశంతో గడ్డివామికి నిప్పు పెట్టారు. దీనిపై తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశానని, స్థలానికి సంబంధించిన పేపర్లు తీసుకువస్తే పరిశీలిస్తామని పోలీసులు చెప్పినట్టు బాధితుడు వాపోయాడు.

పొంచి ఉన్న ప్రమాదం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తహానగర్ గ్రామంలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరు మోటారు విద్యుత్ స్టార్టర్‌కు డోర్ లేదు. దాన్ని విద్యుత్ స్తంభానికి మూడు అడుగుల ఎత్తులో అమర్చారు. పిల్లలు పొరబాటున దాన్ని తాకితే ప్రమాదం జరుగుతుందని, అధికారులు స్పందించి స్టార్టరుకు డోర్ అమర్చాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో వెలసిన సర్వమంగళ సమేత పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రదోష పూజలు నిర్వహించనున్నట్టు ఈవో లత తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రదోష మండపంలో నందీశ్వరునికి, వాల్మీకీశ్వర స్వామికి, మరగదాంబిక అమ్మవారికి ఏక కాలంలో విశేష అలంకారాలు, అభిషేకాలు, మహాహారతి కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ప్రదోష పూజలో పాల్గొనదలచిన వారు రూ.500 చెల్లించాలని సూచించారు.

తెప్పపై శ్రీకృష్ణస్వామి విహారం



తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం సాయంత్రం శ్రీఆండాళ్ సమేత శ్రీకృష్ణస్వామి తెప్పలపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆండాళ్ సమేత శ్రీకృష్ణ స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు పుష్కరిణిలో తెప్పపై కొలువైన స్వామి, అమ్మవారు ఐదు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేశారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగారు. సోమవారం నుంచి బుధవారం వరకు శ్రీగోవిందరాజస్వామి వారు శ్రీదేవి, భూదేవితో కలిసి తెప్పపై విహరించనున్నారు. కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయంగార్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన మహాశివరాత్రి పనులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి మార్చి 6 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. స్థానికులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యతో తరలివస్తారు. వారికి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో అధికారులు ఉత్సవాల నిర్వహణపై అధికారులు, సిబ్బందితో సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. ఏర్పాట్లకు సంబంధించిన పనులు చేపట్టలేదు. పోస్టర్లను ఆవిష్కరించలేదు. ఆహ్వాన పత్రిక ఇంకా తయారు కాకపోవడంతో మంత్రులు, ఎమ్మెల్యేలకు ఇవ్వలేదు. ధూర్జటి ప్రాంగణంలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి ప్రముఖులు ఎవరు పాల్గొంటారనే అంశంపై ఇంత వరకు అవగాహన లేదు. అలాగే ముగ్గులు, రంగులు వేసే పనులు నత్తనడకన సాగుతున్నాయి. క్యూలైన్ల ఏర్పాటు, మరుగుదొడ్లు, తాగునీరు, తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదు. అద్దెగదులన్నీ ఆలయానికి వచ్చే వీఐపీలకే సరిపోతున్నాయి. భక్తుల బస కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఉత్సవాల సమయం దగ్గరపడుతున్నా అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


స్వాధీనం చేసుకున్న వాహనాలతో ఎస్ఐ, సిబ్బంది

పార్లపల్లిలో కార్డన్ సెర్చ్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పార్లపల్లిలో ఆదివారం ఉదయం ఎస్ఐ విశ్వనాథనాయుడు సిబ్బంది కలిసి కార్డన్ సెర్చ్ చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఇంటి వద్దనున్న వాహనాల రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రికార్డు సక్రమంగా లేని వాహనాలు ఎక్కువగా ఉండడంతో వాటిని గుర్తించడానికి కార్డన్ సెర్చ్ చేపట్టినట్లు తెలిపారు. రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నామన్నారు. చోరీ వాహనాలను కొనుగోలు చేస్తున్నారని, ఇది చట్టరీత్యానేరమని. పట్టుబడితే జైలుకు వెళ్లడం ఖాయమని తెలిపారు. వాహనాల రికార్డులు ఉండాలని, లేకుంటే జరిమానా తప్పదని హెచ్చరించారు. రికార్డులు లేని రెండు ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు.


వరదయ్యపాళెంను కమ్మేసిన పొగ మంచు


పొగ మంచు కారణంగా తెల్లవారినప్పటికీ లైట్లు వేసుకుని వస్తున్న వాహనదారులు

కమ్మేసిన పొగ మంచు

ఈ నెల ప్రారంభం నుంచి వాతావరణంలో పలుమార్పులు చోటుచేసుకున్నాయి. పగలు ఎండలు మండుతున్నాయి. రాత్రి మంచు ఎక్కువగా కురుస్తోంది. చలి కూడా అదే స్థాయిలో ఉంది. ఉదయం 7 గంటలైనా పొగ మంచు వీడడం లేదు. ఇల్లు, ఊరు ఆనవాళ్లు కనిపించకుండా కమ్ముకుంటోంది. రోడ్లపై వెళ్లే వాహనదారులు లైట్లు వేసుకోవాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితుల కారణంగా జనం సైతం బయటకు రావడం లేదు. పొగ మంచు కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

–వరదయ్యపాళెం